క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ముకుందవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుశ్రీలక్ష్మి

రంగంపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి సూచించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ముకుందవరం గ్రామంలో శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రత్యేక వైద్యాధికారులు ఆర్.పార్వతి, ఇందిర, కంటి వైద్య నిపుణులు హాజరై 286 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు, ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఓ పి.ప్రసాద్, పీహెచ్‌ఎన్ ఎల్.గంగాభవానీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మానసాదేవికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న సర్పంచ్ కొల్లు లోవకుమారి దంపతులు

పెదపూడి: మండలంలోని చింతపల్లిలో ప్రసిద్ధి చెందిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం నవగ్రహ వేంకటేశ్వరస్వామి ఆరాధన నిర్వహించారు. పూజల్లో స్థానిక సర్పంచ్ కొల్లు లోవకుమారి, ఆమె భర్త గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లు సత్తిబాబు యజ్ఞకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి వీర వెంకట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పండితులు విఘ్నేశ్వర పూజ, గవ్యాంతం మానసాదేవి యంత్రార్చన, నవగ్రహ మండపారాధన, అభిషేకం, కుంకుమర్చాన, మానస హోమం, నవగ్రహ హోమం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, నాగమణి దంపతులు, కొల్లు మల్లేశ్వరరావు, శ్రీదేవి దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండల బూత్ కమిటీల అధ్యక్షుడు విష్ణుప్రసాద్



పట్టపగలు విష్ణుప్రసాద్

సీతానగరం: మండల బూత్ కమిటీల అధ్యక్షుడిగా రఘుదేవపురానికి చెందిన పట్టపగలు విష్ణుప్రసాద్‌ను నియమించినట్టు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి సంస్థాగతంగా బూత్ కమిటీలు ఎంతగానో కృషి చేస్తాయని, సీతానగరం మండలంలోని గ్రామాల బూత్ కమిటీలను సమన్వయం చేసుకుని అత్యధిక శాతం ఓటింగ్ పోలింగ్ అయ్యేలా కృషి చేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచించారు

లాభాల బాటలో బూరుగుపూడి సొసైటీ

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడుస్తోందని చైర్మన్ బుడ్డిగ సత్తిబాబు తెలిపారు. శనివారం సొసైటీ ఆవరణలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. సంస్థ రూ.18.50 కోట్ల టర్నోవర్‌తో ఉందని, దీర్ఘకాలిక రుణాలు రూ.6 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.3 కోట్లు, వ్యవసాయేతర రుణాలు రూ.9 కోట్ల ఉన్నట్టు తెలిపారు. పాత బకాయిల వసూలు చురుగ్గా సాగుతోందని, మొండి బకాయిలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పర్సన్ ఈర్ల గంగేశ్వరుడు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సీఈఓ ఈదల సుదర్శనరావు, రైతులు చీంద్రం శ్రీహరి, శెట్టి రాము, చెరకూరి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజల మద్దతు కోరుతూ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీని నమ్ముకుందన్నారు. ఎన్నికల్లో తనకు పార్టీ టికెట్ కేటాయించామని, ప్రచారం చేసుకోమని ముందు చెప్పి ఇప్పుడేమో బీజేపీకి సీటు ఇచ్చామంటున్నారన్నారు. అందుకే ప్రజలు తనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, టీడీపీ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సుడిగాలి పర్యటన
- టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పలువురికి పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అంతా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరిని కలుసుకుని, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపించాలని కోరుతూ సీతానగరం, రాజానగరం మండల గ్రామాల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. సీతానగరం మండలానికి సంబంధించిన రామచంద్రపురం గ్రామంలోను, రాజానగరం మండలానికి సంబంధించి కొండగుంటూరులో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలాల్లో నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టేలా వ్యూహాలు రచించాలని, ప్రజలను మరోసారి మభ్యపెట్టడాని ఇక చంద్రబాబు నాయుడు కూటమితో చేతులు కలిపారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోను అత్యధిక మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలన్నారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

పలువురు పార్టీలో చేరిక

సీతానగరం మండలంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమక్షంలో టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వంగలపూడి గ్రామానికి చెందిన కాజా తాతాజీ, సింగవరానికి చెందని అల్లూరి శ్రీనులతోపాటుగా పలువురికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా రాజానగరం మండలం కొండగుంటూరులో 30 మంది టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ కార్యక్రమలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైఎస్ఎంపీపీ-1 ముదునూరి సురేష్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వీరన్నబాబు, తిర్నాతి చిన్నా, కవల కృష్ణమూర్తి, రంధి భారతిదేవి, కోలా శ్రీను, వలవల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

ఫ్యాన్ గుర్తుకు ఓటేద్దాం... ప్రత్యర్థులను ఓడిద్దాం..!



ముగ్గళ్ల ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, జక్కంపూడి రాజశ్రీ

- ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- ముగ్గళ్లలో జోరుగా ఎన్నికల ప్రచారం

సీతానగరం: ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించి, ప్రత్యర్థులను చిత్తుచిత్తుగా ఓడిద్దామని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పిలుపునిచ్చారు. శనివారం ముగ్గళ్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎంపి అభ్యర్థి శ్రీనివాస్, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పాల్గొన్నారు. వీరికి గ్రామస్తులు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరించారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు ఆళ్ల కోటేశ్వరరావు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, సాదె చంటిబాబు, రుద్రం వీరేంద్ర, కూచిపూడి వీర ప్రభాకరరావు, కూచిపూడి బాలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మగ్గం వర్క్ శిక్షణ



మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న వినయ్ సుంకర ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: కొత్త తుంగపాడు గ్రామంలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ శనివారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 50 మంది మహిళలకు దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, వినీల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్త తుంగపాడు గ్రామంలో గతంలో మగ్గం వర్క్ శిక్షణ, టైలరింగ్ శిక్షణ ఇచ్చామన్నారు. ఇలా మూడు బ్యాచ్‌లకు ఉచితంగా శిక్షణ అందించామన్నారు. ఈ శిక్షణ పేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గంధం కృష్ణవేణి శిక్షకురాలిగా వ్యవహరించారు. ఫౌండేషన్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ఎమ్మెల్యే రాజా పరామర్శ



చినకొండేపూడిలో త్రిమూర్తుల రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో పలువురిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. రఘుదేవపురానికి చెందిన వెలమాటి నాగన్న ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ పంతుల శ్రీను మేనల్లుడు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చినకొండేపూడిలో నంబూరి త్రిమూర్తుల రాజు తల్లి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, వైస్ఎంపీపీ-1 ముదునూరి సురేష్‌రాజు, ముదునూరి రామకృష్ణరాజు, యర్రంశెట్టి బాబులు, గెద్దాడ త్రిమూర్తులు, చిడిపి బంగారయ్య, పిండి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రాజకుమార్ తదితరులు

పెదపూడి: రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.రాజకుమార్ అన్నారు. పెదపూడి గ్రామంలో శనివారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభించి ఊరచెరువు, మార్కెట్ సెంటర్, పోలీస్‌స్టేషన్ మీదుగా సాగి దోమాడ సచివాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజకుమార్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా ఓటర్లను భయపెట్టినా, ప్రలోభాలు గురిచేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని దీన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. యువత వారి ఓటు హక్కును వినియోగించుకుని పోలింగ్ శాతం పెంచేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ ఎస్.సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.త్రివేణి, బీఎల్‌వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మహా అన్నసమారాధన

బిక్కవోలు: స్థానిక మదులమ్మ తల్లి ఆలయం వద్ద ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కావున భక్తులు తరలి వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

స్వామి స్మరణానంద జీవితం స్ఫూర్తిదాయకం



స్వామి స్మరణానందజీ మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అనపర్తి: రామకృష్ణ మిషన్ అధ్యక్షులు స్వామి స్మరణానందజీ మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకమని అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అన్నారు. రామకృష్ణ మిషన్ 16వ అధ్యక్షులు స్వామి స్మరణానందజీ మహరాజ్ ఈ నెల 26న పరమపదించారు. ఈ సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోళ్ల రైతుల సంక్షేమ సంఘం సెమినార్ హాలులో స్మరణానందజీ మహరాజ్ సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముందుగా స్వామీజీ చిత్రపటానికి సమితి ప్రతినిధులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ 16వ అధ్యక్షుడిగా 2017 నుంచి ఆయన కొనసాగుతున్నారని తెలిపారు. భగవాన్ శ్రీరామకృష్ణులు ప్రబోధానికి అనుగుణంగా పలు కార్యక్రమాలు చేపట్టిన స్వామీజీ ఎంతోమంది ఆధ్యాత్మిక సాధకులకు మంత్రదీక్షను అనుగ్రహించి ఆధ్యాత్మిక మార్గదర్శనం చేశారన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు సత్తి బుల్లితమ్ము, కార్యదర్శులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది ఆర్‌వీజీ పట్నాయక్, మల్లిడి వెంకటరెడ్డి, పి.సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో రన్ ఫర్ జీసెస్



పశ్చిమగానుగూడెం సెయింట్ లూథరన్ చర్చిలో క్రైస్తవులు

మధురపూడి: కోరుకొండలో క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈస్టర్ పండగను పురస్కరించుకొని పశ్చిమగానుగూడెం సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొలుత జంభూపట్నంలోని బెతస్తా చర్చి నుంచి ప్రారంభమైన కార్యక్రమం పశ్చిమగానుగూడెంలోని సెయింట్ పాల్స్ చర్చికి చేరుకుంది. క్రీస్తు బోధనలు మానవాళి అభివృద్ధికి మార్గాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ కృపావిల్సన్, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపెల్లి ప్రవీణ్ కుమార్, సంఘ పెద్దలు లాజరెస్, రాయుడు, జూలి, జోయల్‌రాజ్, కాంతిరాజ్ పాల్గొన్నారు.

ముగిసిన జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రీతూ

రాజానగరం: ఆహ్లాదకరమైన వాతావరణ, ప్రకృతి రమణీయతతో కూడిన ప్రాంగణం చదువుకునే విద్యార్థులకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని అందిస్తాయని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (న్యూఢిల్లీ) దంత వైద్య, పరిశోధన విభాగాధిపతి డాక్టర్ రీతూ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల దశాబ్ది ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో ఉన్న ఆధునిక వైద్య పరికాలు, మౌలిక సదుపాయాలు గురించి ప్రస్తావిస్తూ, కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, దంత వైద్య కళాశాల మెంటర్ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు సదరం క్యాంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కలిగిస్తోందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగులకు సమగ్ర శిక్షా, సహిత విద్య ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల పంపిణీ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు దిన ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రత్యేక అవరాలు గల విద్యార్థులకు మనం మానసిక స్థైర్యాన్ని ఇవ్వాలన్నారు. విద్యార్థుల దగ్గరకే వైద్యులు వచ్చి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పరికరాలను అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి 5 రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు, మూడు రోజులు వేరు శనగ చిక్కీ, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీవీబీఎస్ నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేయబడిన ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎస్. కనకబాబు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమానికి పెద్దపీట



పీరా రామచంద్రపురంలోని ఓ కర్మాగారంలో కార్మికులను కలిసి వారి మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శనివారం మండలంలోని పీరారామచంద్రపురంలోని వ్యాపార సంస్థలు, కర్మాగారాల్లో వివిధ వర్గాల ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగించుకుందన్నారు. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి అన్ని వర్గాలకూ న్యాయం చేశారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీతో విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీచక్ర ఆయిల్స్ అధినేత చింతా గోపాలకృష్ణారెడ్డి, సర్పంచ్ తేతల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోనాల సాయిరామారెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే దిక్సూచి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- పైన గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం



పైన గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే దిక్సూచిలా నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. శనివారం పైన గ్రామంలో ఆదిలక్ష్మి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రజలు గడప గడపలో హారతులు పట్టి, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ గొప్ప మానవతావాది అన్నారు. జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసినట్లు తెలిపారు. జగన్ పాలనలో ఇంటింటికీ డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరుతున్నాయని చెప్పారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వాస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు మారాయని గుర్తు చేశారు. జగన్ పాలనలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా గూడురు శ్రీనివాస్‌ను, సీఎంగా జగనన్నను గెలిపించడానికి అందరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, పి.చంద్రకళ, మేడపాటి విజయ, పార్టీ గ్రామ కన్వీనర్ పంపన నాగరాజు, కట్టా రమణ, దంగేటి దుర్గారావు, వనుం రవి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జీవన విధానాన్ని పెంపొందించుకోవాలి



పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న అధికారులు

సీతానగరం: బాలలకు వారి జీవన విధానాన్ని పెంపొందింపచుకోవడానికి బాలల హక్కులు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఎల్‌సీపీఓ శ్రీగౌరి అన్నారు. శనివారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్, బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మిషన్ వాత్సల్య, బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హక్కులపై అవగాహన కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఎల్‌సీపీవో శ్రీగౌరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కులను ఆమె వివరించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్‌ఐసీ జి.క్రాంతిలాల్ మాట్లాడుతూ బాల్య వివాహాలు వలన ఎదురయ్యే సమస్యలు, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కస్తూరి సతీష్ బాబు, ఉపాధ్యాయులు రాజేశ్వరి, సరళ, విశాలాక్షి, విద్యార్థులు పాల్గొన్నారు


403 మందికి వైద్య పరీక్షలు



కూనవరంలో జరిగిన శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీతానగరం: మండలంలోని కూనవరం ఎంపీయూపీ స్కూల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 403 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈశిబిరంలో స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ బి.సునీత, శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ వి.మనోజ్, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.మేఘన, ఆప్తాలమిక్ ఆఫీసర్ కె.సత్యప్రసాద్ 403 మందికి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, పంచాయతీ సిబ్బంది శ్రీను, ఎల్‌ఎల్‌హెచ్‌పీలు బి.కీర్తి, కావేరి, కృష్ణవేణి, ప్రశాంతి, శ్వేత, ఏఎన్‌ఎంలు ఎం.సునీత, శారద, జ్యోతి, కుమారి, ప్రశాంతి, పద్మ, ఎల్‌టీ శిల్ప, 104 విజయ్ హెల్త్ అసిస్టెంట్లు సుంకర నగేష్ బాబు, స్వామి, రూప్‌కుమార్, ఆశావర్కర్లు ఎం.ధనలక్ష్మి, వరలక్ష్మి, నిర్మల, పార్వతి, వీరగనీక, వెంకటలక్ష్మి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

తాత్కాలికంగా సమ్మె విరమణ



బిక్కవోలులో సమ్మెను తాత్కాలికంగా విరమించిన కార్మికులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద 44 రోజులుగా బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం నవంబర్ 28 నుంచి అక్రమ లేఆఫ్ ప్రకటించి విధులకు హాజరుకాకుండా చేశారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, డిప్యూటీ లేబర్ కమిషనర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. అయినా యాజమన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె ప్రారంభించామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారుల సూచనలతో సమ్మెను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ తమ పోరాటానికి పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్మిక అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, ఉపాధ్యాయులు కె.వెంకటరమణ, కోశాధికారి ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవాలు ప్రగతికి సూచికలు

కంబాలచెరువు: పాఠశాలల్లో నిర్వహించే వార్షికోత్సవాలు ప్రగతికి నివేదికలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్లమ్మపేట నున్న కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల శనివారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేలా ఈ పాఠశాలలో అన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా ప్రదర్శించిన చిన్నారులను అభినందించారు. ప్రధానోపాధ్యాయిని సేవా రాజ్యలక్ష్మి వార్షిక ప్రగతి నివేదిక అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో-2 రమా రజని, గాడాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్ఎస్ జ్యోతికుమారి, బీవీవీఆర్ పద్మావతి, పేరెంట్ కమిటీ చైర్మన్ కె.వెంకట లక్ష్మీ, సీతం పేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైతన్యకుమార్, తుమ్మలావ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గోపీ అప్పారావు, వార్డు పెద్దలు, పేరెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.